క్లుప్తంగా

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

బలిజిపేట: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బలిజిపేటలోని గ్రంథాలయంలో సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకుడు రాజగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థి దశ నుంచి వారికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్.సుధారాణి, పి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో..

పార్వతీపురంటౌన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజున పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జెంజేటి రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలు మాత్రమే కాకుండా గ్రంథాలను కూడా అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు టి.శివకేశవరావు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం చరిత్రను వివరించారు. ఈ పోటీలో చిరంజీవులు, ముక్తేశ్వరి, లలిత కృష్ణవేణిలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుకన్య, శాంతి, తెర్లి రవికుమార్ పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం



అంపావల్లిలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించిన ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు

బలిజిపేట: మండలంలోని అంపావల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. పంటకోత ప్రయోగాల వల్ల పంట దిగుబడులు ఏమేరకు వచ్చాయనేది తెలుస్తుందని ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు ఈ సందర్భంగా తెలిపారు. ర్యాండమ్ పద్ధతిలో భాగంగా 86.21సర్వే నంబర్‌లో గల బంకురు గౌరునాయుడు పంటపొలంలో 5అడుగుల పొడవు, 5అడుగుల వెడల్పు విస్తీర్ణంలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ విస్తీర్ణానికి 14.800కిలోల దిగుబడి వచ్చినట్లు ఏఓ తెలిపారు. ఈ ప్రకారం ఎకరాకు 2,397కిలోల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. రైతుల పంటలకు ఈక్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల వారి పంటను వారే విక్రయించు కునేందుకు వీలుంటుందన్నారు.కార్యక్రమంలో వీఏఏ కె.శ్రావణ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హైందవశక్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తుల వితరణ



దుస్తులు పంపిణీ చేస్తున్న హైందవశక్తి జిల్లా ప్రతినిధి వెంకటలక్ష్మి

సీతానగరం: జిల్లాలో హైందవ శక్తి సంస్థద్వారా పేదలకు వివిధ రకాల దుస్తులను వితరణ చేయనున్నట్లు హైందవశక్తి జిల్లా ప్రతినిధి అల్లు వెంకటలక్ష్మి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బగ్గందొరవలస ఇంటింటికీ వెళ్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థలను ప్యాంట్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైందశక్తి స్వచ్ఛంద సంస్థ ద్వారా జిల్లాలోని పలుగ్రామాల్లో గ్రామ పెద్దల సూచనల మేరకు దుప్పట్లు, దుస్తులు, పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బగ్గందొరవలసలో 30 మంది విద్యార్థులకు షర్టులు, ప్యాంట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైందవ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రతీ గ్రామ పంచాయతీని స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు సూచించారు. కురుపాం ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ, సుందర పార్వతీపురం మన్యం జిల్లా కార్యక్రమంలో భాగంగా కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు, ఈవోపీఆర్‌డీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర సలహాదారు శ్రీనివాసన్‌తో కలిసి కాసేపు మాట్లాడిన ఆయన.. గాంధీ కలలుగన్న గ్రామ సీమలు నెలకొల్పాలని పిలుపునిచ్చారు.



పార్వతీపురం ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహంలో విద్యార్థులు నివసిస్తున్న గదిలో బైక్ పార్కింగ్



పార్వతీపురం బైపాస్ కాలనీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో శిథిలావస్థలో బాత్‌రూమ్‌లు

సంక్షేమ హాస్టల్స్‌లో క్షేమం నిల్

- కానరాని మౌలిక సౌకర్యాలు
- కల్పించని మౌలిక వసతులు
- ఒక్కో గదిలో 20 మంది ఉంటున్న పరిస్థితి

పార్వతీపురంటౌన్/పార్వతీపురం/సీతానగరం:

సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం పార్వతీపురం నియోజకవర్గంలో వసతి గృహాలను పరిశీలిస్తే ఒక్కో గదిలో 20 మంది విద్యార్థులు ఉంటున్న పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి నాయకులు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు. కొన్ని వసతి గృహాల్లో తాగునీటి సౌకర్యం, మరి కొన్ని వసతిగృహాల్లో ఫెన్సింగ్, ఇంకా కొన్నింటిలో కిటికీలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

హాస్టల్స్‌లో పర్యవేక్షణ కరువు

సంక్షేమ వసతిగృహాల్లో అధికారుల పర్యవేక్షణ కరువవడంతో పాటు హాస్టల్స్‌లో కొంతమంది వార్డెన్‌లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులు నివసిస్తున్న గదిలో ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారంటేనే అర్థం అవుతోంది వారి పర్యవేక్షణ ఏ రకంగా ఉందన్న విషయం. వసతి గృహాల్లోని వంటగదుల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక అపరిశుభ్ర వాతావరణంలో వంట ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.



పార్వతీపురం బైపాస్ కాలనీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో శిథిలావస్థలో వంటగది

- పార్వతీపురంలోని బైపాస్ కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో 30 మంది విద్యార్థులు ఉంటున్నారు. వసతిగృహం పూర్తిగా మరమ్మతుల బారిన పడింది. ఎప్పుడు ఏమవుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వసతిగృహ నిర్వాహకులు వసతిగృహం కోసం నిర్మించిన వంట గదిలో విద్యార్థులు ఉంటున్నారు. వసతిగృహంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు కూడా అధ్వానంగా ఉన్నాయి.
- జోగింపేటలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 470 మంది విద్యార్థులు ఉన్నారు. రహదారి సౌకర్యం అంతంత మాత్రమే. సోమవారం 390 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ వసతి గృహంలో ఆర్‌ఓప్లాంట్ పనిచేయక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బయట నుంచి నీరు తెచ్చి తరగతి గదులకు డబ్బాల ద్వారా అందిస్తున్నారు. విద్యాలయంలో ఎక్కువమంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వేతనంపై ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు .అలాగే తరగతి గదులకు కిటికీలు లేకపోవడంతో రేకులతో కాపాడాల్సిన దుస్థితి ఏర్పడింది. సోలార్ విద్యుత్ బ్యాటరీలు, సిస్టం పనిచేయడం లేదు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఏం చేయాలో తెలియక భయాందోళన చెందుతున్నారు.

క్లాస్ రూమ్ అదే..నివాసం అదే

కురుపాం ఏకలవ్య పాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాలలో 338 మంది విద్యార్థులు ఉండగా కేవలం నాలుగు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. తరగతి గదిలోనే విద్యార్థుల చదువు నివాసం ఉండడంతో వారు పడుతున్న అవస్థలు ఇన్నిఅన్నీ కావు. ఈ విషయమై స్థానిక ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా పాఠశాల తరలించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని సమాధానం ఇచ్చారు.

ఆరుబయటే భోజనాలు

సాలూరు రూరల్: మండలంలో 6 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. అయితే ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సోమవారం సాక్షి పరిశీలనలో స్పష్టంగా కనిపించింది. మావుడి గిరిజన బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి చూస్తే డైనింగ్ హాల్ లేకపోవడంతో ఆరుబయటే భోజనాలు చేస్తున్నారు. అలాగే 350 మంది విద్యార్థులకు ఒక్క వంట మనిషి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. విద్యాసంవత్సరం పూర్తికావస్తున్నా విద్యార్థులకు ఇంతవరకు దోమతెరలు పంపిణీ కాలేదు. దీంతో దోమతెరలు లేకుండానే కాలం గడుపుతున్నారు. అలాగే మామిడిపల్లి బాలికల వసతిగృహంలో బాలికలకు అంతంత మాత్రంగానే సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులకు సరిపడా డార్మిటరీ లేక అవస్థలు పడుతున్నారు. కొత్త భవనం ఇంకా నిర్మాణదశలోనే ఉంది. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. బాలికల వసతి గృహానికి ప్రహరీ తక్కువ ఎత్తులో ఉన్నందున సెక్యూరిటీ పరంగా కొంత ఇబ్బందికరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. కొత్తవలస బాలికల వసతి గృహం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అలాగే వంట గది, డైనింగ్ హాల్ పనులు జరుగుతున్నాయి.



మావుడి ఆశ్రమ పాఠశాలలో ఆరుబయట భోజనం చేస్తున్న విద్యార్థులు



దోమతెరలు లేకుండానే విద్యార్థుల మంచాలు



జోగింపేటలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మరమ్మతులకు గురైన ఆర్‌ఓ ప్లాంట్



మరమ్మతుల బారిన పడిన ఇన్వర్టర్



పార్వతీపురం ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహంలో అపరిశుభ్ర వాతావరణంలో వంట

మైనింగ్ కంపెనీలను అరికట్టాలి

- రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

మక్కువ: అడవులను నాశనం చేస్తున్న మైనింగ్ కంపెనీలను అరికట్టాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ డిమాండ్ చేశారు. మండలంలోని దుగ్గేరు గ్రామంలో సోమవారం కామ్రేడ్ జన్ని తిరుపతి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు స్థానిక గిరిజన భవన్ నుంచి మార్కెట్ షెడ్ వరకు ర్యాలీ చేసి, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా హాజరైన రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ గిరిజనులకు అండగా ఉంటానని హామీలు ఇచ్చిన నరేంద్ర మోడీ గిరిజనులు అడవుల్లో ఉండాలంటే వారి హక్కులను నిరూపించుకోకుండా ద్వంద్వవైఖరిని ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. విదేశీ కార్పొరేట్ మైనింగ్ కంపెనీలు అడవులను దోచుకోవడానికి వస్తున్నాయని వాటిని ఎదుర్కోవడానికి అందరూ సంఘాల్లో సమాయత్తమై ఉండాలని పిలుపునిచ్చారు. పోరాటాలు చేసినప్పుడే గిరిజనులకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేక బంజరు, పోరంబోకు భూములు భూస్వాములు, పెత్తందారుల చేతుల్లో ఉన్నాయని వాటి కోసం పోరాడితే తప్పుడు కేసులు బనాయించి అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. వాటిని మనమందరం కలిసికట్టుగా ఎదురుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు పి.శ్రీనునాయుడు, ఎం.భాస్కర్‌రావు, ఉపాధ్యక్షులు పి.అసిరి, కె.వెంకటస్వామి, గిరిజన సంఘం నాయకులు ఎం.చెంచు, కందులపదం గ్రామ సర్పంచ్ తాడంగి కన్నంనాయుడు, దుగ్గేరు, మూలవలస, మెండంగి తదితర గ్రామాల నుంచి గ్రామపెద్దలు ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

న్యాయం చేయాలని ఆందోళన



కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు

పార్వతీపురం: రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాలలో ఇటీవల హఠాన్మరణానికి గురైన నిమ్మ జీవన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, గిరిజన, విద్యార్థి సంఘం నాయకులు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.పండు మాట్లాడుతూ జీవన్‌కుమార్ కుటుంబానికి రూ.10లక్షలు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు ఆ కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. జీవన్‌కుమార్ మృతికి కారణమైన పాఠశాల హెచ్ఎంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఏఎస్ఎం పోస్టులు, రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు, గిరిజన సంఘం నాయకులు పి.రంజిత్‌కుమార్, బి.రవికుమార్, భీమరాజు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభోశంకర

బలిజిపేట: కార్తీకమాసం మూడవ సోమవారం శివాలయాలు భక్తుల శివనామస్మరణతో హోరెత్తాయి. తెల్లవారు జామునుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మాలాధారణ చేసినవారు స్వామి వారిని దర్శించుకున్నారు. సాధారణ భక్తులు క్యూలో నిల్చుని స్వామివారి దర్శనం చేసుకున్నారు. నారాయణపురం, గలావల్లి, గంగాడ, చిలకలపల్లి, బలిజిపేట, వెంగాపురం, మిర్తివలస, బర్లి, అరసాడ తదితర గ్రామాలలో ఆలయాలలో భక్తులు పూజలు చేశారు. ముఖ్యంగా నారాయణపురంలో నీలకంఠేశ్వరస్వామి, గలావల్లి ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వరాలయం

పార్వతీపురంటౌన్: పవిత్ర కార్తీకమాసం మూడవ సోమవారం పట్టణ, మండల వ్యాప్తంగా భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. అడ్డాపుశీలలోని శివాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. అతి పురాతన కాశీవిశ్వేశ్వరుని ఆలయం, పట్టణంలోని పార్వతీ పరమేశ్వరుల ఆలయం, ఎస్ఎన్‌పీలోని శివాలయం, నవిరి కాలనీలో మల్లికార్జున స్వామి ఆలయం, బెలగాంలోని పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయాలకు తెల్లవా రు జామునుంచే భక్తులు పోటెత్తి అభిషేకాలు, పూజల్లో పాల్గొన్నారు.



గలావల్లిలో శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పిట్టలవలసలో పూజలకుంటున్న శివుడు



అడ్డాపుశీల ఆలయంలో పూజలందుకున్న స్వామి వారు

వీఆర్‌ఏలపై నిర్బంధాన్ని ఆపాలి



సాలూరు: మాట్లాడుతున్న నాయకులు



మక్కువలో నిరసన తెలియజేస్తున్న వీఆర్‌ఏలు

సాలూరు: వీఆర్‌ఏలపై నిర్బంధాన్ని ఆపాలని ఆ ఉద్యోగుల సంఘం నాయకులు పాపారావు, జగన్ తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు సాలూరు పట్టణంలో మాట్లాడుతూ, తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో జరగనున్న ధర్నాకు వెళ్లకుండా అన్ని మండలాల్లో వీఆర్‌ఏలను పోలీసులతో నిర్బంధించి అడ్డుకున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. వీఆర్‌ఎలకు నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పేస్కేల్ జీతాలు చెల్లించాలని, వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మన్ తదితర పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజమాణిక్యం, దమయంతి, లక్ష్మీప్రసన్న, సీతమ్మ, పార్వతమ్మ, మోహన తదితరులు పాల్గొన్నారు.

మక్కువలో...

మక్కువ: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కారం కోసం, విజయవాడలో జరగనున్న ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా అన్ని మండలాల్లో ప్రభుత్వం పోలీసులతో నిర్బంధించడం అన్యాయమని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రం మక్కువలో వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు నిరసన తెలుపుతూ, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తీరిన రహదారి సమస్య

- అంటిపేట–వెన్నెలబుచ్చింపేట గ్రామాలకు రోడ్డు పూర్తి

సీతానగరం: మండలంలోని అంతర్రాష్ట్ర రహదారిపై అంటిపేట జంక్షన్ నుంచి వెంకటాపురం మీదుగా వెన్నెల బుచ్చింపేట గ్రామానికి రహదారి పనులు పూర్తి కావడంతో ఆయాగ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. అంటిపేట నుంచి వెంకటాపురం, వెన్నెలబుచ్చింపేట గ్రామాల ప్రజలు రాత్రి పూట రాకపోకలు నిర్వహించడానికి అవస్థలు పడుతున్నామని తమకు బీటీ రోడ్డు మంజూరుచేయాలని గత ప్రభుత్వం హయాంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వినతి పత్రం అందజేసిన విషయం తెలిసిందే. ప్రజల కోరిక మేరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు అప్పటి ఎమ్మెల్యే జోగారావు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.35 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2023 డిసెంబర్ 15న భూమిపూజ జరిగింది. భూమి పూజ జరగడం వల్ల పాతమెటల్ రోడ్డుపై గోతులు పూడ్చిన అనంతరం మూడు రకాల మెటల్ వేసి యుద్ధప్రాతిపదికన రోడ్డు పనులు జరిగాయి. నిర్వాహకులు తారురోడ్డు వేసే సమయానికి సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో చేస్తున్న పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఆయాగ్రామాల ప్రజలు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ప్రస్తుత ఎమ్మెల్యే బి.విజయచంద్ర దృష్టికి తీసుకువెళ్లడంతో రోడ్డు పనులు వేగవంతం చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. దీంతో రోడ్డుపనులు పూర్తికావడం వల్ల ప్రజల కష్టాలు తీరాయని సర్పంచ్ బి.తిరుపతిరావు, మాజీ సర్పంచ్ సిరికి మహేశ్వరరావు, ఎంపీటీసీ నిర్మల, మాజీ డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, వి.దానబాబు ఆనందం వ్యక్తం చేశారు.



పూర్తయిన బీటీ రోడ్డు



బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు(ఫైల్)

జగన్నాథపురం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిశీలన

పార్వతీపురంటౌన్: జగన్నాథ పురం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ప్రతిరోజూ ఆస్పత్రిలో వైద్యసేవలు వినియోగించుకుంటున్న వారికి నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీల వివరాలు రికార్డుల్లో పరిశీలించారు. దీర్ఘకాలిక రోగులను పరీక్షించేటప్పుడు వారి ఆరోగ్యం ఏ మేరకు మెరుగు పడుతుందో పర్యవేక్షించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకోవాలని సిబ్బందిని కోరారు. అదే సందర్భంలో వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి జె.పరిమళ, డీఎస్‌ఓ శంకర్, వైద్య సిబ్బంది ఉన్నారు.



యూపీహెచ్‌సీలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు

పిక్నిక్ కోలాహలం

సీతానగరం: కార్తీక మాసంలో మూడవ సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని కార్తీక దామోదరుని భక్తులు సీతానగరం మండలంలోని మామిడి, జీడి తోటల్లో పిక్నిక్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మరిపివలస, నిడగల్లు, బూర్జ గ్రామాల్లోని తోటల్లో పిక్నిక్‌లు జరిగాయి. ఈ మేరకు సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన ఈ ప్రాంత భక్తుల ఆరాధ్య దైవంగా కొలిచే ఎండల మల్లికార్జునేశ్వరస్వామి ఆలయప్రాంగణంలో గల తోటల్లో పూజలు, తాళం భజనలు, కోలాటం పాటలను ఆలపించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నసంతర్పణ నిర్వహించారు.



అన్నసంతర్పణ చేస్తున్న నిర్వాహకులు